క్లుప్తంగా

దివ్యాంగుల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు



తిరువూరు: మానసిక దివ్యాంగుల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని తిరువూరు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం అసిస్సీ సేవా సదనంలో మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను జడ్జి సందర్శించారు. వారికి అందుతున్న సేవలను, కల్పిస్తున్న సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని, వారి కోసం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీ నారాయణ, న్యాయవాది రాజువరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

తిరువూరు: ఎరువులు, పురుగుమందుల విక్రేతలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పక పాటించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో అందుబాటులో ఉన్న ఎరువుల స్టాకు వివరాలను ప్రతి రోజూ బోర్డులో ప్రదర్శించాలని, గరిష్ట ధర కంటే ఎక్కువకు విక్రయించరాదని చెప్పారు. రైతులు అధిక ధరలకు ఎరువులు కొనవద్దని, అన్ని ఎరువులూ సరిపడా స్టాకు ఉన్నాయని చెప్పారు. డీలర్లు ఎరువులను ఎక్కువ ధరకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలుకు బిల్లు తప్పక తీసుకోవాలని కోరారు.

వీల్‌చైర్స్ అందజేత

ఎ.కొండూరు: హోప్ ఆర్గనైజేషన్ సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. కంభంపాడు గ్రామంలో శుక్రవారం హోప్ ఆర్గనైజేషన్ కంభంపాడు వారి ఆధ్వర్యంలో ఎనిమిదిమంది దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీల్ చైర్స్ అందించిన దాత శైల (యూఎస్ఏ)కు హోప్ సంస్థ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హోప్ సంస్థ ఫౌండర్ బి. విశ్వభారతి, టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కులదూషణ కేసులో నిందితులను శిక్షించాలి

పెద్దవరం(తిరువూరురూరల్): చేపల సొసైటీలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరినందుకు దళిత యువకుడిని కులం పేరుతో దూషించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలోని పెద్దవరంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకుడు పల్లికంటి డేవిడ్ దళితుల తరఫున చేపల సొసైటీలో సభ్యత్వాల కోసం డిమాండ్ చేసినందుకు అతనిపై నెలరోజుల కిందట గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మారబత్తుల గోపాల్ అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామని చెప్పారు. ఈ నెల 19న ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మండలాల్లో ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

తిరువూరు: స్థానిక పాత బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అన్న క్యాంటీన్ ప్రాంగణంలో దివంగత సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి ఎమ్మెల్యే, బీసీ సంఘాల నాయకులు కందిమళ్ల శేషగిరిరావు, వాకదాని లక్ష్మీనారాయణ, సింధూ శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు.

● **నూజివీడు:** పట్టణంలోని రామాయమ్మారావుపేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో పనులపై పట్టణాలకు వచ్చే పేదలకు రూ.5లకే కడుపు నిండా భోజనం అందించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హీల్ సంస్థ సేవలు ప్రశంసనీయం

ఆగిరిపల్లి: తోటపల్లిలోని హీల్ సంస్థ దివ్యాంగుల విద్యకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని సక్కు గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మాధవీలత అన్నారు. పిడుగురాళ్లకు చెందిన బూసి, మేరి, పశ్చిమ గోదావరి జిల్లా మాముదూరుకు చెందిన మోహినీలకు ఆమె కృత్రిమ కాళ్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ అనాథ పిల్లలకు, దివ్యాంగులకు, ఉచిత విద్య, వసతి తోపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్స్ ద్వారా వందలాది మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హీల్ సంస్థ సీఈఓ అజయ్ కుమార్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, డైరెక్టర్లు రంగ ప్రసాద్, వైవీఎస్ చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

అరకొర బస్సులతో సరి!

- దూరప్రాంతాలకు సర్వీసులు రద్దు
- డొక్కు బస్సులతో ప్రయాణికుల అవస్థలు
- గ్రామీణ ప్రాంతాలకు బస్సులు కరవు

తిరువూరు: ప్రయాణికుల అవసరాల మేరకు బస్సు సర్వీసులు నడపకుండా ఉన్న సర్వీసులను కూడా తిరువూరు డిపో రద్దు చేస్తోంది. 50 ఏళ్ల కిందట ఏర్పడిన ఈ డిపోలో కొత్త సర్వీసులను ప్రయాణికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఇతర డిపోల నుంచి వచ్చే సర్వీసులలో నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. డిపోలో ఆర్టీసీ బస్సులు 52 ఉండగా, అద్దె బస్సులు 23 ఉన్నాయి. సూపర్ లగ్జరీ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నిర్ణీత కిలోమీటర్లు పూర్తయినా ప్రత్యామ్నాయం లేక పలు రూట్లలో తిప్పుతుండటంతో ఇంధన పొదుపు సామర్థ్యం తగ్గిపోతోంది. తరచూ మరమ్మతులకు గురవుతున్న బస్సులు మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయి.



గ్రామీణ ప్రాంతాలకూ సర్వీసులు కరవు

ఎంతోకాలంగా గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్న బస్సులను సైతం ఆదాయం రావట్లేదని ఆర్టీసీ రద్దు చేస్తోంది. తిరువూరు నుంచి విస్సన్నపేట, గంపలగూడెం, వావిలాల, నూతిపాడు రూట్లలో గతంలో ఉదయం, సాయంత్రం నడిపే గ్రామీణ సర్వీసులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. వీటిని గత రెండు నెలలుగా రద్దు చేయడంతో బస్ పాసులున్నా ఉపయోగించుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

ప్రయాణికులు కోరుతున్న సర్వీసులు ఇవే..

తిరువూరు నుంచి బెంగళూరు, గంగావతి, విశాఖపట్నం, శ్రీశైలం, నాగాయలంక, మచిలీపట్నంలకు గతంలో నడిపిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తిరువూరు డిపో అధికారులు ఏర్పాటు చేసిన ప్రయాణికుల సదస్సులు, డయల్ యువర్ డీఎం కార్యక్రమాల్లో సైతం ఈ సర్వీసులను కోరిన వారే అధికంగా ఉన్నారు. విజయవాడ నగరానికి నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మచిలీపట్నంలోని జిల్లా కోర్టుకు, ఇతర న్యాయస్థానాలకు, జిల్లా పరిషత్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్లే తిరువూరు ప్రాంత ప్రజలకు ఉదయం 5.30 గంటలకు తప్ప ఇతర సమయాల్లో బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు కూడా మచిలీపట్నానికి గతంలో నడిపిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్త సర్వీసులకు ప్రతిపాదనలు పంపాం

దూరప్రాంతాలకు ప్రయాణికులు కోరుతున్న సర్వీసులను నడపడానికి ప్రతిపాదనలు పంపాం. ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సు సర్వీసులు నడుపుతాం. బస్సుల కండీషన్ మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన బస్సుల స్థానంలో యాజమాన్యం కొత్తవి సరఫరా చేస్తున్నారు.

– వేణు, తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్

డిపో అభివృద్ధి చేయాలి



తిరువూరు డిపోలో పాత బస్సులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌కు ఏసీ బస్సు, విజయవాడకు నాన్‌స్టాప్, సింగిల్ స్టాప్ సర్వీసులను నడపాలి. ప్రయాణికులు దీర్ఘకాలంగా కోరుతున్న పలు సర్వీసులను పునరుద్ధరించాలి.

– డి. ఆనందరావు, తిరువూరు

దూరప్రాంత సర్వీసులు నడపాలి



తిరువూరు నుంచి దూరప్రాంతాలకు బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో లాభదాయకంగా నడిచిన సర్వీసులను రద్దు చేయడంతో ఆర్టీసీకి ఆదాయం తగ్గడమే కాక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నందన వెంటనే వాటిని పునరుద్ధరించాలి.

– మాలపాటి ఉదయ్, తిరువూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ దత్త రోడ్డు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంత్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ టీవీ సుధాకర్ తెలిపారు. ట్రిపుల్ ఎస్ కాలనీ, వస్తలత కాలనీ, రాయల్ ఒపేరా అపార్ట్‌మెంట్ ఏరియాలో ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేశామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తుమ్మగూడెం, సోమవరం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నూజివీడు: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ ఘటనపై ఆమె తల్లిదండ్రులు పడే ఆవేదన కడు దయనీయంగా ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదులకు పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని డి.హరినాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలు

గంపలగూడెం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో వరలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి పటాలు, విగ్రహాలను విశేషంగా అలంకరించారు. లక్ష్మీదేవి అష్టోత్తర శతనామావళి, అష్టలక్ష్మీస్తోత్రం, మహాలక్ష్మీ అష్టకం, మణిదీప వర్ణన తదితర ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. పొంగలి తయారు చేసి వంటకాలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. పూజల అనంతరం వాయినాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. మండలంలోని ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపారు.

● **ముసునూరు:** మండల వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ దేవికి గృహాల్లో పూజలు చేశారు. వరలక్ష్మీదేవికి తమ కోర్కెలు విన్నవించుకున్నారు.

● **నూజివీడు:** వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీరతో సారె, ప్రసాదాలు సమర్పించి, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆరుగొలనుపేట లక్ష్మమ్మ, అంకమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నూజివీడులో కోట మహిషాసురమర్ధిని అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సౌకర్యాలు కల్పించడంలో విఫలం..

ఆలయానికి విచ్చేసిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవదాయ శాఖ అధికారులు విఫలమయ్యారని పలువురు వాపోయారు. ఆలయ ఆవరణలో తాగడానికి కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. ప్రసాదం కూడా అరకొరగానే తయారు చేయడంతో అధిక శాతం మంది భక్తులకు ప్రసాదం అందలేదని ఆరోపించారు.

● **చాట్రాయి:** మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరుగొలనుపేట లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్ల ఆలయంలో పెద్దఎత్తున భక్తులు పూజలు, వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామికి పవిత్ర మాలల అలంకరణ

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, రుత్విక్కుల బృందం ప్రారంభించారు. అనంతరం వేణుగోపాలస్వామికి విశేష ఆరాధన, అష్ట కలశ స్నపన, నూతన వస్త్ర సమర్పణ చేశారు. స్వామి మూలవిరాట్‌కు పవిత్ర మాలల అలంకరణ చేశారు. లోక కల్యాణార్థం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని శాంతి కల్యాణం కనులవిందుగా జరిపారు. పాడి పంటలు సంవృద్ధిగా పండి దేశ ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని కోరుతూ మహా శాంతి హోమాలు నిర్వహించారు. పవిత్ర మాలల అలంకరణలో స్వామి దర్శనం ఇవ్వడంతో భక్తులు పులకించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, భక్తులు పాల్గొన్నారు.



తిరువూరులో వైద్యుల నిరసన



తిరువూరు: పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యా ఘటనను నిరసిస్తూ తిరువూరులో వైద్యులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు పట్టణంలోని ప్రైవేటు నర్సింగ్ హోంల వైద్యులు 24 గంటల పాటు వైద్య సేవలను నిలిపివేశారు. వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ రామకోటేశ్వరరావు, రవీంద్ర తదితరులు డిమాండ్ చేశారు. బోస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన జరిపిన అనంతరం తిరువూరు ఆర్డీఓ మాధవికి వినతి పత్రం సమర్పించారు.

రీసెర్చ్ ప్రపోజల్ ప్రిపరేషన్‌పై అవగాహన

మైలవరం: అధ్యాపకులు రీసెర్చ్ ప్రపోజల్ రాయడం, ప్రజంటేషన్ ప్రిపేర్ అవడంపై అవగాహన కలిగి ఉండాలని ఐఐటీ గౌహతి సెంటర్ ఆఫ్ నానో టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.పామ్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్ అండ్ డీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సంయుక్త ఆధ్వర్యంలో రీసెర్చ్ ప్రపోజల్ ప్రిపరేషన్ అంశంపై అధ్యాపకులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిటీల ముందు రీసెర్చ్ ప్రజంటేషన్ ఎలా ఇవ్వాలి, దానికి ముందు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.వీరయ్య, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పిచ్చిరెడ్డి మాట్లాడారు. డాక్టర్ పి. భగత్ కో– ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు

ఎ.కొండూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. గిరిజనులకు ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమం ఎ.కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 16 గిరిజన తండాల నుంచి మహిళలు, యువకులు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ప్రజల నుంచి 150 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కార దిశగా అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా తిరువూరు నియోజకవర్గంలోని ఒక మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వాసం మునియ్య, ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్, తహసీల్దార్ బి. ఆశయ్య, ఎంఈఓలు రాజశేఖర్, కేశవరావు, మండల వ్యవసాయాధికారి టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

బడుగుల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

మైలవరం: భారతదేశ రాజకీయాలలో తనదైన ముద్రవేసిన ధీశాలి, త్యాగశీలి సర్దార్ గౌతు లచ్చన్న అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాహసానికి, కార్యదక్షతకు గౌతు లచ్చన్న నిదర్శనమని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్ర్య సమర యోధులు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం కొండపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు లచ్చన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చేసిన సామాజిక సేవలను వారు కొనియాడు. కార్యక్రమంలో నాయకులు వెంకట నరసయ్య, నిమ్మల రాజు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మైలవరంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత

ఒత్తిడిని తగ్గించుకుంటే ఆరోగ్యం

కాచవరం(ఇబ్రహీంపట్నం): ఒత్తిడిని తగ్గించుకుంటే ఆరోగ్యవంతులవుతారని పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్‌డీ పర్వీన్ అన్నారు. కాచవరంలో విజయవాడ వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్యంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వాసవి మహిళా మండలి వారు స్వాంతన ప్రోగ్రాం ద్వారా ఇబ్రహీంపట్నం మండలాన్ని ఎంపిక చేసుకుని ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని జయించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రముఖ సైక్రియాటిస్ట్ బోడేపూడి శరత్ ఒత్తిడి తగ్గించుకునే విధానాలను వివరించారు. సీహెచ్ఓ నారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పర్వీన్

సంక్షిప్తంగా...

● **పలువురు ఎస్ఐల బదిలీ**

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం బి.మోహనరావు రెడ్డిగూడెంకు, జి.జాషువారాజు ఇబ్రహీంపట్నంకు బదిలీ అయ్యారు. అలాగే కె.సతీష్‌కుమార్ ఎస్ఈబీ నుంచి జి.కొండూరుకు, వి.వెంకటరావు గుణదల నుంచి తిరువూరుకు, జీవీవీ సత్యనారాయణ తిరువూరు నుంచి సూర్యారావుపేటకు, ఎండీ షబ్బీర్ అహ్మద్ జి.కొండూరు నుంచి సత్యనారాయణపురానికి, కేవీజీవీ సత్యనారాయణ తిరువూరు నుంచి టూ టౌన్‌కు బదిలీ అయ్యారు.

● **నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక**

నూజివీడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తామని ఏపీఓ సోమేశ్వరి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

● **మైక్ సెట్ బహూకరణ**

ఆగిరిపల్లి: తోటపల్లి దుగ్గిరాల బాల రావమ్మ దేవస్థానానికి పెదపారుపూడి మండలం వింజరంపాడుకు చెందిన మేడిబోయిన దుర్గారావు శుక్రవారం రూ.25 వేల విలువైన మైక్ సెట్‌ను ఆలయ కార్య నిర్వాహణాధికారి సురేష్ బాబుకు అందజేశారు.

● **జూదరుల అరెస్ట్**

చాట్రాయి: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సూరంపాలెం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,850 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

● **ఆలయ నిర్మాణానికి సహకరించండి**

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బీకాలనీలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కొండపల్లి బొమ్మ అందజేసి సత్కరించారు. షాబూఖారీ దర్గా మత గురువు అల్తాఫ్ రజా మాట్లాడుతూ కొండపల్లిలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయానికి ఎన్టీటీపీఎస్ నుంచి విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు.

● **44 మందికి వైద్య పరీక్షలు**

ముసునూరు: గుడిపాడులో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నామని రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కరీముల్లా శుక్రవారం తెలిపారు. శిబిరంలో 44 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు డెంగీ టెస్టులు చేయగా నెగెటివ్ వచ్చాయని, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విజయవాడలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నాడని చెప్పారు.

● **రాంబ్రహ్మం జెండా ప్రదర్శన**

గంపలగూడెం: గంపలగూడెంలో రాంబ్రహ్మం జెండాను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఇక్కడ హిందూ, ముస్లింలు కలిసి రాంబ్రహ్మం జెండాను కార్తికమాసంలో ప్రదర్శించడం ఆనవాయితీ. స్థానిక జెండా రావి చెట్టు వద్ద తొలుత జెండాకు పూజలు చేశారు. అనంతరం జెండాను భక్తులు ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగించారు. జెండా ఇళ్ల ముంగిటకు రాగానే భక్తులు నీళ్ల వారబోసి టెంకాయలు కొట్టారు.

● **రిటైర్డు ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు**

తిరువూరు: తిరువూరు రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి వైద్యులు 40 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదరావు, మార్కు పర్యవేక్షించారు.

● **శోభనాచలుడికి ప్రత్యేక పూజలు**

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, లక్ష్మీనరసింహ సుదర్శన మూలా మంత్ర హోమం, దిగువ సన్నిధిలోని స్వామి వారికి పవిత్రాలు సమర్పణ, నవ కుంభారాధన, శాంతి హోమం ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి సురేష్‌బాబు పర్యవేక్షించారు.

● **సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు**

తిరువూరు: విద్యార్థులు స్మార్ట్ ఫోన్లను వినియోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం. రాంప్రదీప్ అన్నారు. తిరువూరులోని సిద్ధార్థ స్కూల్ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్ వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పంపే సందేశాలను నమ్మవద్దని చెప్పారు. ఆన్‌లైన్ క్రీడలతో డబ్బులు వస్తాయని ఆశ చూపేవారున్నారని, ఇవి జేబులు గుల్ల చేస్తాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. స్థానిక యాదవ బజారులో విద్యార్థులకు, తల్లిదండ్రులకు సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎమర్జెన్సీ నెంబర్ 112పై, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్ర కుమార్, ఏఎస్ఐ తవేరియా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ**

నాగులూరు(మైలవరం): రెడ్డిగూడెం మండలం నాగులూరు విజయబాబు కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నాగులూరు గ్రామానికి చెందిన అడపా రాంబాబు రూ. నాలుగు వేల విలువ చేసే రెండు ఫ్యాన్లను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. అనుగ్రహ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు కె. విజయబాబు స్థానికులు పాల్గొన్నారు.

● **వాజ్‌పేయికి నివాళి**

ఇబ్రహీంపట్నం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో శుక్రవారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథరెడ్డి, నాయకులతో కలిసి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి సేవలను కొనియాడారు. నాయకులు కూనల యుగంధర్, కాజా కిరణ్, సత్యవతి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.